ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025

స్టేట్ టాపర్‌గా సింధు



● ఏపీ పీజీసెట్‌లో ఉరవకొండ విద్యార్థిని ప్రతిభ

ఉరవకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీసెట్- 2025లో ఉరవకొండకు చెందిన బెల్డోన్ సింధు జువాలజీ విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచారు. ఏపీ పీజీసెట్ ఫలితాలు గురువారం విడుదల చేశారు. జువాలజీ విభాగంలో 79మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. చేనేత కుటుంబానికి చెందిన సింధు మొదటి ర్యాంకు సాధించడంతో ఆమె తల్లిదండ్రులు రామాంజనేయులు, జ్యోతి హర్షం వ్యక్తం చేశారు.



బరువు..
బాధ్యత..!



మీ భవిత.. మా భుజాలపై..

బాగా చదువుకో బుజ్జీ..!

ఆశలన్నీ మీ పైనే..!





దర్జాగా చదువుకో నానా..!

బిడ్డల చదువుకోసం పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు పడే ఆరాటానికి దర్పణం ఈ ఫొటోలు. అనంతపురం నగరంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ వందలాది మంది పేదింటి విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు, వాటి హాస్టళ్లలో ఉంచి చదివించే ఆర్థిక స్థోమత లేనివారు సంక్షేమ హాస్టళ్లను నమ్ముకుంటున్నారు. పట్టణాలకు దూరంగా ఉండే తండాలు, గ్రామీణ ప్రాంతాలవారు జిల్లా కేంద్రంలో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. హాస్టల్‌లో ఉంటే తమ బిడ్డల కడుపు నిండుతుందని, బాగా చదువుకుంటే వారి భవిష్యత్తు బాగుంటుందని తాపత్రపడుతున్నారు. పాఠశాలలతో పాటు వసతి గృహాలను తెరవడంతో ఇలా పెట్టెలు, సంచులు మోసుకుంటూ తమ బిడ్డలతో అనంతకు వచ్చారు తల్లిదండ్రులు. వారి కలలను నెరవేర్చాల్సిన గురుతర బాధ్యత గురువులు, వార్డెన్లపై ఉంది. బాలలూ.. చూస్తున్నారుగా ఇంట్లోవారి కష్టం..? బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలి మరి..!

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య

నిరుద్యోగ మహిళలతో ఆటలు..!

● అసమగ్రంగా ఆశా కార్యకర్తల నోటిఫికేషన్
● దరఖాస్తు ఎక్కడివ్వాలో తెలియని వైనం
● సచివాలయం, ఆరోగ్య కేంద్రాల చుట్టూ మహిళల ప్రదక్షిణ
● డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పరుగులు
● ఇక్కడికొచ్చినా నిరాశే..



దరఖాస్తులపై డీఎంహెచ్‌ను అడుగుతున్న అభ్యర్థులు

అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు.. నిరుద్యోగ మహిళలతో ఆటలాడుతున్నారు. ఆశా కార్యకర్త పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ వారిని ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారు. నోటిఫికేషన్‌లో 58 ఖాళీలు అని చెప్పి.. స్థానాలు మాత్రం 57 చూపుతున్నారు. దరఖాస్తు ఎక్కడివ్వాలన్న దానిపై కూడా స్పష్టత లేదు. గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. మహిళలు దరఖాస్తులతో అక్కడికెళ్తే వారు తీసుకోవట్లేదు. అలాంటపుడు నోటిఫికేషన్‌లో పేర్కొనడం దేనికని మహిళలు మండిపడుతున్నారు. జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) కార్యాలయానికి (మిగతా 7లో...)

నీకింత.. నాకింత..!

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



ఉపాధి పథకంలో టీడీపీ నాయకుల వసూళ్లు



● కొన్ని చోట్ల ప్రతి వారం ముడుపులు ఇవ్వాల్సిందే
● కూలీల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లకు.. వారితో నాయకులకు..
● పనులకు వెళ్లకపోయినా హాజరైనట్లు మస్టర్లు
● తెలుగు తమ్ముళ్ల దందాపై సీఎంఓకి ఫిర్యాదు

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూలీలకేమోగాని కొందరు మండల టీడీపీ నాయకులకు మాత్రం ఉపాధి పథకం కల్పతరువుగా మారింది. మీరు ఏం చేసుకుంటారో మాకు తెలియదు మా వాటా మాకివ్వాల్సిందే అంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు టార్గెట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. అవినీతిని నివారించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు కొందరు కూడా అక్రమ బాట పట్టారు. ప్రతి నెలా ప్రతి పంచాయతీ నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే అవినీతి హెచ్చుమీరిందన్న విమర్శలు వినవస్తున్నాయి.

ప్రతి వారం ముట్టజెప్పాల్సిందే..!

మండలంలో పది గ్రామ పంచాయతీల నుంచి ప్రతి వారం కొంత మంది టీడీపీ చోటా నాయకులకు ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు వేల రూపాయలు ముట్టజెప్పాల్సిందే. మండలంలో తూర్పు వైపు ఉన్న ఒక పంచాయతీలో వారానికే రూ.1.5 లక్షలు, అదే రూట్‌లో ఉన్న మరో పంచాయతీలో రూ.80వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఓ మాజీ ప్రజా ప్రతినిధి తన పంచాయతీలో (మిగతా 6వ పేజీలో...)

పోలీస్ బైక్స్..!



పూజలు చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 22 కొత్త బైక్‌లు వచ్చాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జగదీష్ శుక్రవారం వాటిని ప్రారంభించారు. ఇందులో 20 టీవీఎస్ అపాచీలు, రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు ఉన్నాయి. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ బైక్స్‌కు జీపీఎస్ సిస్టమ్, సైరన్, నైట్ విజన్ లైట్స్, ట్రాఫిక్ క్లియరెన్స్‌కు ఉపయోగపడే మైక్స్ అమర్చారని ఎస్పీ తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. అధునాతన బైక్స్ అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్పెషల్ పార్టీ పోలీసులకు మంజూరైన యూనిఫామ్స్, పీటీ డ్రెస్సులను ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఇలియాస్ బాషా, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు కాంత్రికుమార్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

కారణాలు తెలుసుకోండి..: ఎస్పీ

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు స్పష్టమైన కారణాలను తెలుసుకోవాలని అధికారులను ఎస్పీ జగదీష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్డు భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని డీఆర్‌ఓ మలోలతో కలిసి నిర్వహించారు. జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించాలని, అక్కడ సీసీ కెమెరాలు, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మే 1 నుంచి జూన్ 24 వరకు జిల్లా వ్యాప్తంగా నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై తీసుకున్న చర్యల వివరాలను డీటీసీ వీర్రాజు వివరించారు. హెల్మెట్ ధరించని వారిపై 544 కేసులు, మొబైల్ డ్రైవింగ్‌పై 749 కేసులు, ఆర్సీ లేని వారిపై 13,892 కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 282 సహా.. మొత్తం 19,982 కేసులు నమోదు చేసి, రూ.56,96,885 జరిమానా విధించామని తెలిపారు. నగరంలో 206 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కీలక మలుపు

నకిలీ ఈ స్టాంప్‌ల కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు
పలు ఆధారాలను సేకరించిన అధికారులు
ఎస్ఆర్‌సీ, ఎమ్మెల్యే ప్రమేయం లేదని నిర్ధారణ?

కళ్యాణదుర్గం/అనంతపురం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ స్టాంప్‌ల కేసు కీలక మలుపు తిరిగింది. ఇప్పటికే కళ్యాణదుర్గం పోలీసులు యర్రప్పతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి కీలకమైన ఆధారాలను సేకరించారని తెలిసింది. ముగ్గురినీ శుక్రవారం ఉదయమే కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయానికి తీసుకువచ్చారు. అనుమానిత ప్రభుత్వ ఉపాధ్యాయులను, రియల్టర్లను కూడా విచారించారు. నాలుగు రోజుల నుంచి జిల్లాలోని పలు చోట్ల నకిలీ స్టాంపుల వ్యవహారానికి సంబంధించి వివరాలు ఆరా తీశారు. ముగ్గురు నిందితుల బ్యాంకు స్టేట్‌మెంట్‌లను పరిశీలించి, రికార్డులు సిద్ధం చేశారు.

నేడు అరెస్టు చూపే అవకాశం!

ఈ-స్టాంపుల కుంభకోణం నిందితులను శనివారం అరెస్టు చూపే అవకాశం ఉంది. ఇద్దరు లేదా ముగ్గురు నిందితులను మీడియా ముందుకు తీసుకొచ్చేందుకు జిల్లా పోలీస్ శాఖ యత్నిస్తున్నట్లు తెలిసింది. కళ్యాణదుర్గానికి చెందిన మీ సేవా బాబు అలియాస్ యర్రప్ప ఈ స్టాంపులను ఫొటోషాప్‌లో ట్యాంపర్ చేసి, ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ చెల్లింపులో అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసింది. దీనిపై ఇటీవలే ఎస్ఆర్‌సీ కంపెనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు నిందితులు యర్రప్ప, ఆయన భార్య భార్గవి, మరో వ్యక్తి మోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నకిలీ స్టాంపుల కుంభకోణం రాజకీయ రంగు పులుముకోవడంతో కేసు అనేక మలుపులు తిరిగింది. ఈ క్రమంలోనే ఇటీవల ఈ కేసును టూటౌన్ నుంచి కళ్యాణదుర్గం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితులను సైతం అక్కడికి తీసుకెళ్లి మరింత విచారణ చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో ఎస్ఆర్‌సీ ప్రమేయం, ఎమ్మెల్యే ప్రమేయం లేదని పోలీసులు స్పష్టతకు వచ్చినట్టు సమాచారం. మీసేవా బాబుతోపాటు, ఇతర నిందితులను అరెస్టు చూపించి, రిమాండ్‌కు పంపే అవకాశం ఉన్నట్టు పోలీస్ వర్గాల సమాచారం.

నిత్యనేరాలు

పురం ప్రాంతంలో కలవరం
రోజుకో ఘటనతో ప్రజల్లో ఆందోళన
పోలీసులకు సవాల్

హిందూపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు నిలయమైన పురం ప్రాంతంలో నేరాలు నిత్యకృత్యమవుతున్నా యి. తరచూ హత్యలు, అత్యాచారాలు జరుగుతుండడంతో ప్రజలు కలవరం చెందుతున్నారు. ఎప్పుడు, ఎలాం టి నేరం జరుగుతుందోనని భయంభయంగా ఉంటున్నారు. ఇవి పోలీసులను కలవరపెడుతున్నాయి. కొంతకాలంగా రోజుకో నేరం వెలుగులోకి వస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నేరాలు విపరీతంగా జరిగాయి. అప్పట్లో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. పోలీసులు, అధికార పార్టీ నాయకుల అండతో నేరగాళ్లు రెచ్చిపోయారు. ఇప్పటికీ కొన్ని పోలీసు స్టేషన్లలో వైసీపీ సానుభూతిపరులే ఉండటంతో నేరాలను నియంత్రించలేకపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు సవాల్

వరుస నేరాలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ఒక నేరాన్ని గుర్తించేలోపే.. మరొకటి వెలుగులోకి వస్తోంది. దీంతో (మిగతా 7లో..)

మామా.. ఏక్ పెగ్ లా..!

రిసార్ట్‌లో వైసీపీ లిక్కర్ పార్టీ

అనంతపురం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): 'మామా ఏక్ పెగ్ లా...! అరె మామా ఏక్ పెగ్ లా' అంటూ మందేశారు.. చిందేశారు..! కొందరు వైసీపీ నాయకులు, ప్రముఖులు, మరికొందరు లిక్కర్ పార్టీ చేసుకున్నారు. అనంతపురం రూరల్‌లోని నారాయణపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఓ రిసార్ట్ ఈ విందుకు వేదిక అయింది. రిసార్ట్‌లోకి మద్యం అనుమతి లేకున్నా, ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిళ్లనూ తీసుకెళ్లి సేవించినట్లు సమాచారం. ఈ విందు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కొనసాగినట్లు తెలిసింది. రిసార్టులో జరుగుతున్న ఈ తంతు గురించి స్థానికులు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫోన్ చేసి తెలియజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. పౌరులు బాధ్యతగా సమాచారమిస్తే.. దాడులు చేసి, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నాయకులపై భక్తిని చాటుకున్నారు. చర్యలు తీసుకోవడం అటుంచి, మందు కొట్టేవారికి ఫోన్ చేసి మరీ సమాచారమిచ్చారు. 'మీ పార్టీ విషయం లీక్ అయ్యింది. బయటకు పొక్కకుండా ఎలాగోలా మేనేజ్ చేసుకోండి' అని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కొందరు అధికారుల తీరు కారణంగా వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని విమర్శిస్తున్నారు. లిక్కర్ పార్టీపై ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా, రిసార్టుల్లోకి మద్యం అనుమతి ఉండదని అన్నారు. ఈవెంట్ పర్మిషన్ మాత్రమే ఇస్తామని తెలిపారు. రిసార్టుల్లో ఈవెంట్ నిర్వహణకు రోజుకు రూ.4,500 చాలానా కట్టాల్సి ఉంటుందని తెలిపారు. నారాయణపురం ప్రాంతంలోని రిసార్ట్‌లో జరుగుతున్న ఈవెంట్‌కు పర్మిషన్ ఇచ్చారా..? అని అడిగితే, తాము అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. గతంలో కొన్ని అనుమతులు ఇచ్చారని, ఇప్పుడైతే ఇవ్వలేదని స్పష్టం చేశారు.



అధికారుల ప్రవర్తన మారాలి: కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనంతపురాన్ని ఉత్తమ జిల్లాగా నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో సానుకూల అవగాహనపై అధికారులతో శుక్రవారం సమీక్షించారు. శాఖల పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను సకాలంలో, ప్రభావవంతంగా అమలు చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారుల పనితీరు, ప్రవర్తనలో మార్పు రావాలని అన్నారు. అధికారుల వైఖరితో పలు అంశాల్లో జిల్లా ర్యాంకింగ్ తగ్గిపోతోందని, ప్రవర్తన మారాలని హెచ్చరించారు. సానుకూల అవగాహనపై జేసీ, డీఆర్వో, జిల్లా అధికారులు చిత్తశుద్ధి చూపించాలని, పని చేయడంలో వైఫల్యమున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి సానుకూల అవగాహన రిపోర్ట్ వచ్చే నెల వస్తుందని, ఇందులో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, మైన్స్ ఏజీ ఆదినారాయణ, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున, జిల్లా టీబీ అధికారి అనుపమ జేమ్స్, సివిల్ సప్లయ్స్ డీఎం రమేష్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, సర్వే ఏడీ రూప్లానాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్26(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలోని చుక్కల భూములు, 22ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. చుక్కల భూములు, 22ఏ భూములను తొలగించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో 22ఏకు సంబంధించి 19 క్లెయిమ్స్‌ను విచారించామని, అందులో 12 ఆమోదించామని, 3 తిరస్కరించామని తెలిపారు. నాలుగు దరఖాస్తులను పునఃపరిశీలనకు పంపామని అన్నారు. చుక్కల భూములకు సంబంధించి 28 క్లెయిమ్స్‌ను విచారించామని, అందులో 24 క్లెయిమ్స్‌ను ఆమోదించామని తెలిపారు. 4 దరఖాస్తులను పునఃపరిశీలనకు పంపామని తెలిపారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మోనార్క్.. మాస్టారు..!

● రేషనలైజేషన్‌లో పోయిన తెలుగు టీచర్ పోస్టు
● అయినా.. బదిలీకి దరఖాస్తు చేసుకోని ఉపాధ్యాయుడు
● నిబంధనలు బేఖాతరు
● హెచ్ఎం, ఎంఈఓ చెప్పినా ససేమిరా
● విద్యాశాఖ మౌనంపై విమర్శలు

అనంతపురం విద్య, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్‌లో పోస్టు పోయింది. నిబంధనల మేరకు తప్పకుండా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. అయినా.. ఓ తెలుగు టీచర్ ఖాతరు చేయలేదు. పాఠశాల హెచ్ఎం, ఎంఈఓ చెప్పినా.. పెడచెవిన పెట్టాడు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా డోంట్ కేర్ అన్నాడు. అంతా నా ఇష్టం అన్నట్లుగా వ్యవహరించాడు. బదిలీలు ముగిశాయి. పని చేస్తున్న పాఠశాలలో ఆ పోస్టే లేదు. ఎక్కడ పనిచేయాలో తెలీదు. గాలిలో ఉండిపోయాడు. నిబంధనలు అతిక్రమించినా, ఆఖరుకు తమ ఆదేశాలను పెడచెవిన పెట్టినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆ టీచర్‌పై ఎందుకో అంత ప్రేమ అన్న గుసగుసలు ఉపాధ్యాయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

డోంట్ కేర్..

రాప్తాడు మండలం హంపాపురంలో పనిచేస్తున్న తెలుగు టీచర్ పోస్టు రేషనలైజేషన్‌లో పోయింది. దీంతో జూనియర్‌గా పనిచేస్తున్న ఆ తెలుగు టీచర్‌ను బదిలీకి తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. అయినా ఆ మాస్టారు దరఖాస్తు చేసుకోలేదు. ఎంఈఓ, హెచ్ఎం చెప్పినా ఖాతరు చేయలేదట. జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బదిలీలు ముగిసినా ఆ టీచర్ వ్యవహారంపై విద్యాశాఖ మౌనవ్రతం పాటిస్తోంది.

గతంలోనూ..

ఆ తెలుగు మాస్టారు గతంలో మూడేళ్లపాటు సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేశారు. రాష్ట్ర శాఖ మూడేళ్లు పనిచేసిన వారందరినీ బడులకు పంపాలని ఆదేశించడంతో గత డీఈఓ వరలక్ష్మి.. ఆయనను మాతృశాఖకు పంపారు. ఆయన సుదూర మండలం నుంచి సమగ్రశిక్షకు వచ్చారు. నిబంధనల మేరకు ఆ మండలానికే వెళ్లాలి. ఈ మాస్టారు సిఫార్సులతో హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అప్పట్లో విద్యాశాఖ అధికారుల తీరుపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కలెక్టర్ పేరు చెప్పి సమస్య తలెత్తకుండా జాగ్రత్తపడ్డారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మళ్లీ ఆ టీచర్ నిబంధనలు ఉల్లంఘించడం గమనార్హం. ప్రస్తుతం బదిలీల్లోనూ అలాగే వ్యవహరించినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమ మార్గంలో దగ్గర స్థానం ఇచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయన్న ప్రచారం ఉపాధ్యాయ వర్గాల్లో వినిపిస్తోంది.

పనిష్మెంట్ స్థానం ఇస్తాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

రాప్తాడు మండలం హంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు టీచర్ పోస్టు రేషనలైజేషన్‌లో పోయిన విషయం వాస్తవమే. జూనియర్ తెలుగు టీచర్ తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయినా.. దరఖాస్తు చేసుకోలేదు. విషయం అప్పట్లోనే మా దృష్టికొచ్చింది. ఆయనకు మిగులు ఖాళీల్లో కూడా పనిష్మెంట్ ప్లేస్ ఇచ్చి పంపుతాం. ఈ విషయంలో రాజీ పడం.

రూ.1,150 కోట్లతో పరిశ్రమ



కళ్యాణదుర్గం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మసముద్రంలో రూ.1,150 కోట్లతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ సంస్థ బైమాడ్యులర్ చార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్‌ను ఇక్కడ నెలకొల్పుతుందని తెలిపారు. ఈ పరిశ్రమకు ఎకరం రూ.8.30 లక్షల చొప్పున 121.53 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. భూ సేకరణ తరువాత 14 నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం సూచించింది. ఈ పరిశ్రమతో సుమారు 300 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు.

నిరుద్యోగ మహిళలతో ఆటలు..!

(5వ పేజీ తరువాయి)

వస్తున్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి. దరఖాస్తు తీసుకునే వారు లేరు, ఎక్కడివ్వాలో చెప్పేవారు కూడా లేరు. జిల్లా వైద్యాధికారి ఇచ్చిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులను ఆ శాఖ జిల్లా కార్యాలయంలోనే తీసుకోకుంటే ఎలాగని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తే తీసుకోనపుడు నోటిఫికేషన్ ఎందుకిచ్చారని నిలదీస్తున్నారు. దరఖాస్తు గడువు కూడా వారం రోజులే ఇచ్చి, అందులోనూ ఒక రోజు సెలవుగా ప్రకటించారు. ఖాళీల వివరాలను హెల్త్ సెంటర్లలో, సచివాలయాల్లోనూ ప్రదర్శించడం లేదంటున్నారు. నోటిఫికేషన్‌ను ఆన్‌లైన్‌లో జారీచేసి చేతులు దులుపుకుంటున్నారని అధికారులపై మండిపడుతున్నారు. సమగ్ర వివరాల్లేక డీఎంహెచ్ఓ కార్యాలయానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుల తడకగా నోటిఫికేషన్..

నోటిఫికేషన్ విడుదల చేసేటపుడు సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రకటన ఉద్దేశం, పొందుపరచాల్సిన అంశాలు, స్వీకరణ గడువు, ప్రాంతాలు, ఖాళీలు ఇలా ప్రతిదీ వివరంగా ఉండాలి. ఆశా కార్యకర్తల నోటిఫికేషన్‌లో వివరాలే లేవు. ఒక ఫైల్ పూర్తిస్థాయిలో ఆమోదం పొందాలంటే.. డ్రాఫ్టర్, జూనియర్ అసిస్టెంట్ నుంచి ఉన్నతాధికారి వరకు సంతకాలు చేసి ఆమోద ముద్ర వేయాలి. ఆశా కార్యకర్తల నోటిఫికేషన్‌ను జిల్లా వైద్యాధికారి వరకు దాదాపు పది మంది అధికారులు పరిశీలించి, ఆమోదం తెలిపి ఉంటారు. అయినా తప్పుల తడకగా ప్రకటనను విడుదల చేయడం శోచనీయం. మొత్తం 58 ఖాళీ స్థానాలు చూపిస్తూ.. 36వ వరుస సంఖ్యలోని ఖాళీ వివరాలను ఎగ్గొట్టడం ఇందుకు నిదర్శనం. ఇతర సమాచారంలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని మండిపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని, కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆశా కార్యకర్తల ఖాళీల వివరాలివీ..

హెల్త్ సెంటర్	ప్రాంతం
కూడేరు	కూడేరు-1 బ్రాహ్మణపల్లి
బొమ్మనహాళ్	దేవగిరి
నార్పల	నడింపల్లి నాయనపల్లి వెంకటాంపల్లి
రాకెట్ల గార్లదిన్నె యర్రగుంట్ల ఆత్మకూరు	ఆమిద్యాల ఎం.కొత్తూరు కోటంక మారెమ్మగుడి రంగంపేట
యల్లనూరు	యల్లనూరు వార్డు-2
యర్రగుంట	కొత్తపల్లి అంబాపురం పూలచెర్ల పుల్లంపల్లి
తాడిపత్రి	యర్రగునపల్లి
తరిమెల	ఏకులనాగేపల్లి
గడేహోతూరు	ధర్మపురి
డి.హీరేహాళ్	పూలకుర్తి
పెద్దపప్పూరు	మచ్చుకోట సింగనగుంటపల్లి దేవునిఉప్పలపాడు
బేతేపల్లి	అనగానిదొడ్డి
బెళుగుప్ప	కోనాపురం
క్రిష్ణాపాడు	భీమునిపల్లి
శెట్టూరు	శెట్టూరు తిప్పనపల్లి-1
శ్రీధరఘట్ట	గొనేహాళ్
ఎంఎస్ పల్లి	బట్టువానిపల్లి యర్రంపల్లి
పుట్లూరు	పుట్లూరు ఎ.కొండాపురం
గుమ్మఘట్ట	కోనాపురం
కుందుర్పి	మలయనూరు
కురుగుంట	ఎ.నారాయణపురం-1 ఎ.నారాయణపురం-5 ఉప్పర్లపల్లి ఏటీపీ రూరల్-2 కొడిమి మన్నీల కందుకూరు-2
నాగలాపురం	కడలూరు
ఆవులదట్ల	గ్రామదట్ల మల్లాపురం కాశీపురం
పి.కొకుంట్ల	వెలిగొండ మైలారంపల్లి
పాల్తూరు	హావళిగి-1
అనంతపురం	శ్రీనగర్ కాలనీ 2వ రోడ్డు 38.మిస్సమ్మ కాలనీ
గుంతకల్లు	32వ వార్డు ఆచారమ్మ కొట్టాల 13వ సచివాలయం
గుత్తి	సీపీఐ కాలనీ-3
రాయదుర్గం	1వ సచివాలయం

సరైన సమాచారం లేదు...



నోటిఫికేషన్‌లో సమగ్ర సమాచారం లేదు. ఇల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పేరుతో జారీచేసిన ప్రకటనలో తప్పులుంటే ఎలా? దరఖాస్తుల స్వీకరణకు కనీసం రెండు వారాలైనా గడువు ఇవ్వాలి. ఏడురోజులు ఇచ్చి, అందులో ఒక రోజు సెలవుదినమని పేర్కొన్నారు. దరఖాస్తులతో ఎక్కడికెళ్లాలి, ఎవరికి ఇవ్వాలని చెప్పలేదు. దీంతో జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి రావాల్సి వస్తోంది.

-విజయలక్ష్మి, దరఖాస్తుదారు, అనంతపురం

ఎవరికి ఇవ్వాలి..?



ఆశా కార్యకర్త పోస్టుకు అప్లికేషన్ ఎవరికి ఇవ్వాలో తెలియడం లేదు. మా ప్రాంతంలోని హెల్త్ సెంటర్, సచివాలయానికి వెళ్తే తమకు సంబంధం లేదంటున్నారు. దీంతో డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు వచ్చా. ఇక్కడా అప్లికేషన్ తీసుకోవడానికి ఎవరూలేరు. సమాచారం కూడా చెప్పడంలేదు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి. నోటిఫికేషన్‌లో చెప్పిన విధంగానూ, డీఎంహెచ్ఓ ఆఫీస్‌లోనూ దరఖాస్తులు తీసుకోవాలి.

-పావని, దరఖాస్తుదారు, అనంతపురం

బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం

174 మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు స్థానచలనం



కౌన్సెలింగ్‌కు హాజరైన వార్డు సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గందరగోళం నడుమ మున్సిపల్ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక జీసెస్‌నగర్‌లోని జయమనెమ్మ కల్యాణమండపంలో 12మున్సిపాలిటీల పరిధిలోని సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐదేళ్లు పూర్తయినవారు 219మంది, స్పౌజ్ ఇతర విజ్ఞప్తుల మేరకు 93 మంది బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 11మున్సిపాలిటీలలో మున్సిపాలిటీ యూనిట్‌గా బదిలీ చేపట్టారు. అనంత నగరపాలక సంస్థలో మాత్రం వార్డు సచివాలయం యూనిట్‌గా బదిలీ చేపట్టడంతో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఇందుకు నిరాకరించారు. నగరపాలక సంస్థలో 38 ఖాళీలు ఉండగా, 23మాత్రమే పొందుపరిచి, మరో 15ని బ్లాక్ చేయడాన్ని జేఏసీ నాయకులు తప్పుబట్టారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా 174మంది అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను బదిలీ చేశారు.

నేడు మూడు ప్రాంతాల్లో కౌన్సెలింగ్

మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఐదు కేటగిరీల ఉద్యోగులకు నగరంలోని మూడు ప్రాంతాల్లో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. జీసెస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణ మండపంలో ఉదయం 9గంటలకు వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. తపోవనం సర్కిల్‌లో ఉన్న పుష్ప ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటలకు వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, మధ్యాహ్నం 2గంటలకు వార్డు అమెనిటీస్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అనంత నగరపాలక సంస్థ నూతన కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 9గంటలకు వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు బదిలీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యనేరాలు..!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎప్పుడు, ఎక్కడ ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. సిబ్బంది కొరతవేధిస్తోంది. దీంతో నేరాల నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. హిందూపురంలో మూడు స్టేషన్లు ఉండగా 40 మంది సిబ్బందికూడా లేకపోవడం శోచనీయం. ఇటీవల బదిలీల్లో కొంతమంది వేరే ప్రాంతాలకు వెళ్లారు. ఇక్కడికి వచ్చినవారు ఎవరూ చేరలేదు.

నియంత్రణకు ప్రత్యేక చర్యలు: మహేష్, డీఎస్పీ, హిందూపురం



నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సిబ్బంది కొరత వాస్తవమే. ఉన్న వారితోనే నేరాల అదుపునకు ప్రత్యేక ప్రణాళిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇటీవల జరిగిన కొన్ని నేరాలు..

- గతేడాది అక్టోబరు 12న చిలమత్తూరు మండలంలో జరిగిన గ్యాంగ్ రేప్ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది.
- నాలుగు నెలల క్రితం తూమకుంటలో చిన్నారిపై అఘాయిత్యం ఈ ప్రాంత ప్రజలను కలవరపెట్టింది.
- మూడు నెలల క్రితం లేపాక్షి మండలంలో కొత్తరకం హనీట్రాప్ వెలుగులోకి వచ్చింది. గతంలో ఇలాంటి ఉదంతం ఈ ప్రాంతంలో ఎన్నడూ వెలుగుచూడలేదు.
- గతేడాది గోళ్లాపురం వద్ద గంజాయి మత్తులో వ్యక్తిని హత్య చేశారు.
- తాజాగా లేపాక్షి మండలంలో వివాహేతర సంబంధం అనుమానంతో వ్యక్తిని దారుణంగా హత్యచేశారు. తల, మొండెం వేరు చేశారు.
- తాజాగా హిందూపురం మండలం మిట్టమీదపల్లి సమీపంలో భార్యాభర్తలను బంధించి నగలు దోచుకెళ్లారు.

రూ.3కే ట్రాక్టర్ మట్టి: మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు ఎరువుగా వాడే చెరువు మట్టి తరలించుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.3 చెల్లిస్తే చాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అధికారులతో మంత్రి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెరువు మట్టి తరలించాలంటే స్థానిక వైసీపీ నాయకుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేద న్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రూ.59 కోట్లతో పెనుకొండ నియోజకవర్గంలో 26చెరువుల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారిని మాయమాటలతో వెంకటరమణ పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి యత్నిస్తుండగా స్థానికులు గమనించి మందలించారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రధాన నిందితుడి అరెస్ట్

దళిత బాలికపై అత్యాచారం కేసులో నిందితులందరూ దొరికారు

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు ప్రత్యూష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 5న ఈ కేసు వెలుగు చూసిన వెంటనే 17 మందిపై కేసు నమోదు చేశారు. ఆరుగురు నిందితులను 9న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 10న మరో ఏడుగురు నిందితులను కూడా రిమాండ్‌కు పంపారు. 11న మరో ముగ్గురు పెద్దమనుషులను నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రత్యూష్ పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. అయితే పోలీసులు ప్రత్యూష్‌పై ప్రత్యేక నిఘా ఉంచి అతడి స్నేహితుని ద్వారా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడు కర్ణాటకలోని ఓ టీకొట్టులో పని చేస్తు కంబదూరుకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీంతో ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో నమోదైన నిందితులందరినీ అరెస్టు చేసినట్లయింది. కాగా ఇదే కేసుల ఓ అరెస్టయిన ఓ బాలుడికి బెయిల్ మంజూరైనట్లు తెలిసింది.

ఆరుగురికి ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వత్థనాయుడు, జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న లీలాబాయి, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న విజయ్‌కుమార్, పెద్దవడుగూరు పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఫణిశేఖర్‌రెడ్డి, పరిగి ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్‌భాస్కర్‌లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ ఇచ్చి ఉమ్మడి జిల్లాకే కేటాయించారు. సోముల దొడ్డి పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రవిచంద్రను ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అయితే ఉమ్మడి జిల్లాలో మరో డిప్యూటీ ఎంపీడీఓ స్థానం ఖాళీగా ఉండటంతో ఇక్కడికే కేటాయించాలని కమిషనర్‌ను కోరనున్నట్లు తెలిసింది. అలాగే కర్నూలు జిల్లా నుంచి ఎంపీడీఓగా అజయ్‌ను సత్యసాయి జిల్లాకు కేటాయించారు.

నేడు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించను న్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో అనంత జిల్లా ఎస్ఈ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ, సూపరింటెండెంట్ ఖాజా ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టను న్నారు. ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సర్క్యూలర్ జారీ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు..

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్లు) పంచాయతీ కార్యదర్శులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించ నున్నారు. జడ్పీలో ఉమ్మడి జిల్లా డీపీఓలు నాగరాజనాయుడు, సమత, డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, శివనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు గ్రేడ్-6 కార్యదర్శులు (డిజిటల్ అసిస్టెంట్లు), మధ్యాహ్నం గ్రేడ్-5 కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సెలవులో రామగిరి సీఐ

వ్యక్తిగతమా...? రాజకీయ ఒత్తిళ్లా?

ధర్మవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రామగిరి సీఐ శ్రీధర్ సెలవులో వెళ్లారు. ఆయన శుక్రవారం నుంచి 20 రోజుల పాటు సెలవుపెట్టినట్లు సమాచారం. ఉన్నఫళంగా సీఐ సెలవులో వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలా...? లేక రాజకీయ ఒత్తిళ్లతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. రామగిరి మండలంలో వరుస పరిణామాల నేపథ్యంలో సీఐ తీవ్ర ఒత్తిడికి గురైనట్లు సమాచారం. ముఖ్యంగా పాపిరెడ్డిపల్లిలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య, జగన్ పర్యటనలో కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద చోటుచేసుకున్న సంఘటనలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. దీనికితోడు రామగిరి మండలంలో ఓ బాలికపై అత్యాచార సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల సూచనతో సెలవుపై వెళ్లరా అనే చర్చ జరుగుతోంది. ఈ కేసుల దర్యాప్తు వేగంగా, సక్రమంగా సాగలేదన్న కారణాలు కూడా ఉండవచ్చని అంటున్నారు. సీఐ శ్రీధర్ తిరిగి ఇక్కడ విధుల్లోకి చేరుతారా లేదా అన్న సందేహం తలెత్తుతోంది. సెలవు విషయంలో సీఐ వివరణ కోసం ప్రయత్నించగా, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది.

నలుగురు పిల్లలతో తల్లి అదృశ్యం

ధర్మవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటతిమ్మాపురం గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భార్య శ్రావణి తన నలుగురు ఆడపిల్లలతో ఈ నెల 25న అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆమె తండ్రి శివయ్య శుక్రవారం ధర్మవరం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 25న తన పిల్లలను హాస్టల్‌లో చేర్పించేందుకు ఆటోలో ధర్మవరానికి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త విజయ్‌కుమార్ ఆమె తండ్రికి విషయం తెలియజేశారు. రెండు రోజులుగా ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శ్రావణి పుట్టినిల్లు కడప జిల్లా యర్రగుంట్ల.

నీకింత.. నాకింత..

(5వ పేజీ తరువాయి)



పసులూరు గ్రామంలో పనిచేయకుండా ఖాళీగా కూర్చున్న కూలీలు (ఫైల్)

ఫీల్డ్ అసిస్టెంట్‌కు 'జీతం మాత్రమే నీది, మిగిలిన అవినీతి సొమ్మంతా నాదే' అని బహిరంగంగా చెప్పి వసూలు చేస్తున్నారు. తాడిపత్రి వైపు ఉన్న ఓ పంచాయతీలో వైసీపీ నుంచి ఇటీవలే టీడీపీలోకి వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతి కూలీ నుంచి వారానికి రూ.300 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నాడు. డబ్బులిస్తే సరి లేదంటే మీకు పని పెట్టేది లేదు అని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ పంచాయతీలో కూలీల ద్వారా వచ్చిన కొంత నగదును పక్కన పంచా యతీకి సంబంధించిన ఇద్దరు టీడీపీ నాయకులకు అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంటులు కొనసాగుతున్నారు. ఎవరికి వారే పోటీ పడి పనికి రాని వ్యక్తుల పేర్ల మీద మస్టర్లు వేసి అప్పనంగా దోచుకుంటున్నట్లు కూలీలు ఆరో పిస్తున్నారు.

నీకు సగం... మాకు సగం ....!

ప్రస్తుతం ఉపాధి పనికి పోకపోయినా ఫర్వాలేదు జాబ్ కార్డు ఉంటే చాలు నేరుగా మీ అకౌంట్‌లో ప్రభుత్వం నగదు జమ చేసేలా మేము చేస్తాం. మాకు సగం... మీకు సగం అంటూ ఒప్పందాలు కుదుర్చుకు ని భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇలాంటి దందా మండలంలో భారీగా సాగుతోంది. మూడు గ్రామ పంచాయతీలలో కూలీలు 400 మంది మాత్రమే పనులకు వెళ్తుంటే 1500 మంది పనికి వెళ్తున్నట్లు మస్టర్ రికార్డు చేస్తున్నారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అసిస్టెంట్లు, వారిపై అధికారి అవినీతికి ప్రధాన సూత్రధారులని పలువురు వాపోతున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇదే దందా కొనసాగుతోంది. పసులూరు గ్రామ పంచాయతీలో రాత్రి పూట ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీయించడం ఉదయం కూలీలు అక్కడికి వచ్చి వెళ్లిపోతే డబ్బులు ఇస్తున్నారని జోరుగా చర్చ జరుగుతోంది.

అవినీతిపై సీఎంఓకి ఫిర్యాదు

నియోజకవర్గంలో జరుగుతున్న ఉపాధి అవినీతిపె కొంత మంది టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గ్రామాల్లో కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ వసూళ్లకు పాల్పడటం వలన పార్టీకి చెడ్డ పేరు వస్తోందన్న విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కొన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించేందుకు పార్టీ నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వీటితో పాటు ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయానికి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న టీడీపీ నేతలను, ఉపాధి సిబ్బందిని పిలిపించి మందలించినట్లు తెలిసింది. అవినీతి లేకుండా పారదర్శకంగా పనిచేసుకోవాలని సూచించినట్లు సమాచారం.

తండ్రిపై కుమారుడి దాడి

పరిగి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో తండ్రిపై కుమారుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం జరిగింది. కిష్టప్ప, శంకరప్ప తండ్రీకొడుకులు. శంకరప్ప తరచూ మద్యం సేవించేవాడు. ఇందుకోసం డబ్బుకావాలని తండ్రిని వేధించేవాడు. మద్యం కోసం డబ్బు ఇవ్వనని కిష్టప్ప చెప్పడంతో శుక్రవారం ఉదయం శంకరప్ప తండ్రిపై కొడవలితో దాడిచేశాడు. కిష్టప్ప కుప్పకూలడంతో మృతి చెందాడని శంకరప్ప అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు కిష్టప్పను 108సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. శంకరప్పను అదుపులోకి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

తాడిపత్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు నెల రోజుల కిందట చిన్నకుళ్లాయప్ప తనపై అత్యాచారానికి యత్నించినట్లు ఓ మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులతో పాటు గ్రామ పెద్దలు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈక్రమంలోనే కొద్ది రోజులు గ్రామం విడిచి దూరంగా ఉండాలని సూచించారు. దాంతో చిన్న కుళ్లాయప్ప సొంతూరు వదిలి వేరేఊరిలో ఉంటున్నాడు. దీంతో సమస్య సద్దుమణిగింది. శుక్రవారం బోడాయిపల్లికి వచ్చి తన పొలంలో పని చేసుకుంటున్నాడని ఆ మహిళ బంధువులకు చెప్పింది. దీంతో వారు పొలం వద్దకు వెళ్లి చిన్నకుళ్లాయప్పపై దాడి చేశారు. తన అన్న బాలయ్యతో కలిసి చిన్నకుళ్లాయప్ప ఎదురుదాడి చేశాడు. ఈక్రమంలో కుళ్లాయప్పతో పాటు మహిళ బంధువులు రంగనాథ, రాకేష్, రంగసుధాకర్ గాయపడ్డారు. వీరికి తాడిపత్రిలో ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యశ్విత సురక్షితం.. నేడు కదిరికి..

కదిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కేరళలో తల్లిదండ్రులు అమ్మేసిన పసిపాప యశ్వితా బాయి(3)ని కదిరి పోలీసులు రక్షించారు. కదిరి మండలం మరవ తండాకు చెందిన శ్రీవాణి, రవీంద్ర నాయక్ దంపతులు ఉపాధి కోసం కేరళకు వెళ్లి, అక్కడ తమ కూతురును వదిలేసి వచ్చారు. పాప ఎక్కడ అని యశ్విత గురించి తాత ఆరా తీయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు గురువారం రాత్రి పాప తల్లిదండ్రులను కేరళకు తీసుకెళ్లారు. కొట్టాయం జిల్లా తిరువళ్లూరులో రాజేష్ అనే వ్యక్తి వద్ద ఉన్న పాపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కదిరికి శనివారానికి చేరుకునే అవకాశం ఉంది. కాగా, పాపను తాము అమ్మలేదని, కొన్నిరోజులు తమ వద్ద వదిలి వెళ్లాలని కోరడంతో విడిచిపెట్టి వచ్చామని చెబుతున్నారు. కానీ పాపను అమ్మినందుకే గొడవ జరిగిందని బంధువులు అంటున్నారు. తాత నిలదీయడంతో యశ్విత తిరిగి తల్లిదండ్రులు, తన ఇద్దరు అన్నల చెంతకు చేరుతోంది.

చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు (గ్రేరంగాలు) టన్ను గరిష్ఠంగా రూ.31,100 అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.15వేలు, సరాసరి రూ.20వేలకు విక్రయాలు జరిగాయన్నారు.

కన్నుల పండువగా ప్రథమ దర్శనం

గూగూడుకు తరలి వచ్చిన భక్తులు



ప్రథమ దర్శనానికి తరలి వచ్చిన భక్తులు



నార్పల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గత ఏడాది బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే దాచి పెట్టిన కుళ్లాయి స్వామి పీరును ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా బయటకు తీశారు. పీరును అత్తరు, పన్నీరు, గంధంతో శుద్ధి చేసి భక్తులకు దర్శనం చేయించారు. కుళ్లాయి స్వామి ప్రథమ దర్శనం కావడంతో నార్పల మండలంతో పాటు తాడిమర్రి, బత్తలపల్లి, శింగనమల, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించాలనీ, ఆ మేరకు అనుకూల వాతావరణం కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇచ్చి, పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2020-23, 2023-27 పాలసీలో 17 యూనిట్లకు రూ.1.14 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారన్నారు. అనంతరం వార్షిక ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీటీఓ మురళీమోహన్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి, డీటీసీ వీర్రాజు పాల్గొన్నారు.

నేడు ఆఖరి ర్యాంకు వరకు కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను శనివారం 1,20,001 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి తెలిపారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000వరకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు 415 మంది విద్యార్థుల హాజరైనట్లు పేర్కొన్నారు. వారికి సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించినట్లు వెల్లడించారు.

కూటమి పాలనపై ఏడాదిలోపే వ్యతిరేకత

వైసీపీ సమన్వయకర్త సజ్జల



సజ్జల రామకృష్ణారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోపే తీవ్ర ప్రజావ్యతిరేకత వచ్చిందని వైసీపీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యార్యమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో జగన్ నామస్మరణ చేయడం తప్ప, అభివృద్ధి ఊసే మరిచారన్నారు. చంద్రబాబు మోసాలను గుర్తు చేసేందుకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇందులో స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలన్నీ వస్తాయన్నారు. అనంతరం రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే రాయలసీమలో స్వీప్ చేస్తామన్నారు. టీడీపీ అనుకూల సర్వేల్లోనే రాయలసీమలో ఎమ్మెల్యేల అవినీతి పరాకాష్టకు చేరిందని ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమన్వయకర్తలు అనంతవెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు నరేష్, మాజీ మంత్రి శైలజానాథ్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, సమన్వయకర్తలు దీప, ఈరలక్కప్ప పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు సలహాలివ్వండి

వ్యవసాయాధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


విత్తన కందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ, కందిపంటలు సాగు చేస్తున్న రైతులకు వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. మండలంలోని వెంకటాపురం సమీపంలో గల తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఆమె కంది పంటసాగును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల సాగును పరిశీలించాలన్నారు. అదును బట్టి ఏ పంటను సాగు చేసుకోవాలని రైతులకు తెలపాలన్నారు. అనంతరం తన పొలం పక్కనే ఉన్న ముత్యాలప్ప పొలానికి వెళ్లి అక్కడి బీర, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. దిగుబడి, గిట్టుబాటు ధరలపై ఆరా తీశారు.

ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం: ఏబీవీపీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): 1975లో జాతీయ భావజాలాన్ని, దేశభక్తిని అణచివేయడం కోసం అప్పటి దేశ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని ఏబీవీపీ నాయకులు విమర్శించారు. ఎమర్జెన్సీకి 50ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం స్థానిక సత్యసాయి మహిళా జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ అధికారదాహం కోసం యావత్తు దేశాన్ని ఇబ్బందుల్లోకి నెట్టిన ఎమర్జెన్సీ నిర్ణయం చీకటి అధ్యాయం అని విమర్శించారు. చీకటి రోజులు పునరావృతం కాకుండా సమాజాన్ని చైతన్యం చేయాలని తెలిపారు. అనంతరం ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన పరచూరు రమేష్‌బాబును సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ అనంతపురం విభాగ్ కార్యవాహ జగదీశ్వర్, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్ రెడ్డి, నాయకులు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూలై 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

శిక్షణకు పేర్లు నమోదు చేయించుకోండి

నార్పల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యాలకు తగిన విధంగా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నటు కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. డేవిడ్ శుక్రవారం తెలిపారు. ఇందులో ఫిట్టర్, ఫాబ్రికేషన్, వెల్డింగ్, టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. టెన్త్, ఆపైన చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు జూలై 2వ తేదీలోపు కళాశాలలో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9010039901 కు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలి

● జడ్పీ సీఈఓ శివశంకర్

రాప్తాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని జడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరణ సరిగా చేపడుతున్నారా.. లేదా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు గ్రామంలో సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రం వద్దకు తరలించాలని అన్నారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకుడు వెంకట్రాముడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కురుబల అభ్యున్నతికి కృషి చేయండి


దేవేంద్రప్పతో ఆవుల క్రిష్ణయ్య తదితరులు

గార్లదిన్నె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కురుబ కులస్థుల అభ్యున్నతికి కృషి చేయాలని కురుబ సంఘం కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పకు టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణయ్య విన్నవించారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన దేవేంద్రప్ప కురుబ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యాక శుక్రవారం మొదటి సారిగా అనంతపురానికి వచ్చారు. స్థానిక మాసినేని గ్రాండ్ హోటల్లో ఉన్న ఆయన్ను టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి బ్యాళ్ల నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆవుల క్రిష్ణయ్య మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కురుబ కులానికి చెందిన ఎంతోమంది యువత చదువుకుని ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా వచ్చే సబ్సిడీ పథకాలను వారికి లబ్ధి చేకూర్చేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు దేవేంద్రప్ప సానుకూలంగా స్పందించినట్లు ఆవుల క్రిష్ణయ్య తెలిపారు.

శాప్ డైరెక్టర్‌గా శివ ప్రమాణం


బాధ్యతలు తీసుకుంటున్న శివ

అనంతపురం క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్‌గా అనంతపురానికి చెందిన తెలుగు యువత నగరాధ్యక్షుడు బొమ్మినేని శివ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో జగిరిన ఈ వేడుకలో క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో శాప్ డైరెక్టర్‌గా శివ బాధ్యతలు తీసుకున్నారు.

గూగూడు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరగాలి

● సిబ్బందికి ఎస్పీ జగదీష్ ఆదేశం


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ


గ్రామంలో పర్యటిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నార్పల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ జగదీష్ సిబ్బందికి ఆదేశించారు గూగూడు గ్రామాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ముందుగా ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామి ఆలయాల్లో ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను, అగ్నిగుండం, పికెట్లు, బందోబస్తుపాయింట్లు, రహదారులు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, జలధి కార్యక్రమాలకు భారీ ఎత్తున భక్తులు ఇక్కడికి వస్తారన్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. గూగూడు బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రూరల్ డీఎస్పీవెంకటేశులు, శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఈఓ శోభారాణి, ఎస్ఐ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ

నార్పల: మండలంలోని గూగూడు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరిశీలించారు. ముందుగా ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గూగూడు గ్రామాన్ని తాను స్వయంగా దత్తతకు తీసుకున్నానని, అన్ని విధా లా అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామం అంతా పర్యటించి అధికారులకు పారిశుధ్యం విషయంలో తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో తీసుకోవాల్సిన చర్యల గురించి డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈఓ శోభను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని విద్యుత్ ఏఈకి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆలంవెంకట నరసానాయుడు, ఆంజనేయులు, రాజన్న, జాఫర్‌వలి, గంగన్నపల్లి రాము, జనసేన నాయకుడు ఈశ్వర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గంధం భరించలేకున్నాం..

● అశోక్‌నగర్ ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త
● ముందుకు సాగని మురుగునీటి ప్రవాహం
● దుర్వాసనతో స్థానికుల అవస్థలు


అశోక్‌నగర్‌లోని ప్రధాన మురుగుకాలువలో ముందుకు కదలని నీరు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్‌లో గల ప్రధాన మురుగు కాలువలో నీటిప్రవాహం స్తంభించిపోయింది. పెద్దఎత్తున చెత్త పేరుకుపోవడంతో నాలుగైదు రోజులుగా నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్వాసనను స్థానికులు భరించలేకున్నారు. అలాగే దోమల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. గతంలో పెద్దగా ఉన్న ఈ కాలవ ఆక్రమణలకు గురై చిన్నగా మారిపోయింది. అందుకే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తింది. అశోక్‌నగర్‌లో బ్రిడ్జి నిర్మించినప్పటికీ కాలవ వెడల్పు చేయలేదు. దీంతో మురుగు నీటి ప్రవాహం స్తంభిస్తోందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఆ కాలవను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా పూల ప్రసాద్

శింగనమల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా పూల ప్రసాద్ నియమితులయ్యారు. శింగనమలకు చెందిన ఆయన్ను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకేశైలజనాథ్ నిమించారు. పూల ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చిన్నజలాలపురానికి చెందిన బండి లలితా కళ్యాణిని పార్టీ నియమించింది. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

45 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

రాప్తాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం నుంచి అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాప్తాడు వై జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ జ్యోతి తెలిపారు. బియ్యాంను అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

శిశుగృహాలో వైద్యశిబిరం

అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బాలసదనం, శిశుగృహాలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. చైల్డ్‌కేర్ సంస్థలు, ప్రత్యేక దత్తత శిబిరాల్లోని బాలబాలికలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జగదీష్ నాయక్, డెంటిస్ట్ ముత్యాలమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ కోర్సులో చేరి.. రోడ్డు ప్రమాదంలో మృతి

● కారు బోల్తా పడి యువకుడి మృతి


హెయాన్స్ మృతదేహం

కనగానపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి 44వ జాతీయ రహదారిపై శుక్రవారం కారు బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు..మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మనీషా బాయ్ తన కుమారుడు హెయాన్స్(20)ను కేరళలోని ఓ కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో చేర్పించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి సొంత కారులో వెళ్లారు. కళాశాలలో అడ్మిషన్ చేయించి తిరుగు ప్రయాణం అయ్యారు. మామిళ్లపల్లి వద్దకు రాగానే ముందు టైరు పగిలి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ముళ్లపొదల్లోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో హెయాన్స్ అక్కడికక్కడే మృతిచెందగా మృతుడి తల్లి మనీషాబాయ్, బంధువులు సమీర్, సందీప్ గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 వాహనంలో ద్వారా క్షతగాత్రులను అనంతపురం తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకోని మృతదేహాన్ని ధర్మవరం తరలించారు.

డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా మల్లికార్జున

చెన్నేకొత్తపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా నరసింగరాయనిపల్లికి చెందిన మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా ఎర్రపల్లికి చెందిన శివారెడ్డి ఎంపికయ్యారు. మండలకేంద్రంలో శుక్రవారం మండలంలోని డీలర్లు ప్రత్యేకంగా సమావేశమై వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ యువనేత పరిటాలశ్రీరామ్, సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి సహకారంతో డీలర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదుకు కృషిచేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాప్తాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మధ్యాహ్నం 12 గంటలకు ఆవిష్కరిస్తామన్నారు. ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

ఇన్‌చార్జి జేడీగా సుధాకర్

● 1న బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా జిల్లా పశుగాణాభివృద్ధి సంస్థ డీడీ సుధాకర్‌ను నియమించారు. ప్రస్తుతం జేడీగా పని చేస్తున్న వెంకటస్వామి ఈనెలాఖరులో రిటైర్డ్ కానున్నారు. ఈ నేపథ్యంలో సుధాకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఆశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా అధికారులు రిటైర్డ్ అయిన తర్వాత ఇతర అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్వర్వులు జారీ చేస్తుంటారు. అయితే సుధాకర్‌కు జూలై 1వతేదీ నుంచి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ముందస్తుగా ఉత్తర్వులు పంపడం గమనార్హం.

నైటీల వ్యాపారి ఆత్మహత్య

గార్లదిన్నె, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు కొండకింద కొట్టాలలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరు కొండకింద కొట్టాలలో అద్దె ఇంట్లో నివాసం ఉండే ఎక్కలూరి ఎల్లప్ప (54) నైటీల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలాగే రూ. 8లక్షల వరకు అప్పులు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గుమికూడారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులనడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.

బిహార్ యువకుడి అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బిహార్‌కు చెందిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. బిహార్‌కు చెందిన అభిషేక్ కుమార్(20) నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఎయిర్ టెల్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. అయితే గురువారం రాత్రి 10 గంటల సమయంలో రక్త వాంతులు చేసుకున్నట్టు సమాచారం. దీంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే అనారోగ్యం కారణంగా వాంతులు అయ్యాయా..? లేక ఇతర కారణం ఏదైనా ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. అయితే ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల వాహనం బోల్తా

● 13 మందికి గాయాలు

ఉరవకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపురం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. అనంతపురానికి చెందిన ఉపాధ్యాయులంతా ఓ వాహనాన్ని అద్దెకు మాట్లాడుకుని, రోజు విడపనకల్లు మండలం పాల్తూరులోని పాఠశాలకు విధులకు వెళ్లి వచ్చేవారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం అనంతపురం నుంచి పాఠశాల విధులకు బయల్దేరారు. మార్గమధ్యంలో కోనాపురం వైపు నుంచి ఓ వాహనం వేగంగా వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న లక్ష్మీనారాయణ అనే ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన 12మందికి స్వల్పగాయాల య్యాయి. వారంతా వేరే వాహనంలో విధులకు వెళ్లారు.

ప్రత్యేక రాయలసీమ కోసం ప్లీనరీ

అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూలై 13న ఎన్జీఓ మీటింగ్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేధావులు, విద్యావంతులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

దండిని అలంకరణలో వారాహిమాత


దండిని అలంకారంలో దర్శనమిస్తున్న వారాహి మాత

అనంతపురం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వారాహి నవరాత్రుల్లో భాగంగా రెండోరోజైన శుక్రవారం కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వారాహి మాత దండిని అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ మహిళామండలి అధ్యక్షురాలు మైలవరం నిర్మలాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకల బ్రోచర్ల విడుదల

అనంతపురం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిమూర్తినగర్‌లో గల వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి మందిరంలో జూలై 10వ తేదీన నిర్వహించనున్న గురుపౌర్ణమిని వేడుకలను విజయవంతం చేయాలని షిర్డీసాయి సాయిబాబా సేవాసంఘం అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శుక్రవారం బ్రోచర్లను ఆవిష్కరించారు. భక్తులు విరివిగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి నాగానందం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలకు తరలిరండి

అనంతపురం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదో రోడ్డులో వెలసిన బీబీ ఫాతిమా దర్గా వద్ద జూలై 14 నుంచి 22వ తేదీ వరకు బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయని, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఉత్సవకమిటీ అధ్యక్షుడు మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు దర్గాలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. దర్గా కమిటీ సభ్యులు నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, తిమ్మప్ప, చంద్రశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్/అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కరవు జిల్లా అయిన ఉమ్మడి అనంతలో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్ఐఓ కార్యాలయంలో ఏఓ సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గల కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల పేరుతో, యూనిఫాం పేరుతో, మెటీరియర్ పేరు తో వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే వాటికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, విజయ్, నరేష్, సాయి, మురళి, ప్రేమానందన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సెలవు

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం సామూహిక సెలవుపై వెళ్తున్నట్లు ఎంపీడీఓ గంగావతికి శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పని ఒత్తిడి తగ్గించాలని, మాతృశాఖకు సంబంధించిన కార్యక్రమాలను మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, రాజేంద్ర, సత్యమ్మ, రామోజీ పాల్గొన్నారు.

పాఠశాలలను అభివృద్ధి చేసుకుందాం

రామగిరి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య అన్నారు. మండలంలోని సుద్దకుంటపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. మనందరం కూడా పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు నాయక్, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ


కోచ్‌తో జిషాన్‌ఖాన్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు జిషాన్‌ఖాన్ ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్‌లో జిషాన్‌ఖాన్ పిస్టల్ సబ్ యూత్ విభాగంలో విజేతగా నిలిచాడు. తద్వారా సెప్టెంబరులో తమిళనాడులో నిర్వహించే సౌత్‌జోన్ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు అర్హత సాధించాడు. దీంతో జిషాన్‌ఖాన్‌ను పలువురు అభినందించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

అనంతపురం విద్య, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి అగ్రిగోల్డ్ వినియోగదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు నారాయణస్వామితో కలిసి ఆయన మాట్లాడారు. వేలం ద్వారా అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి, బాధితులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుని, బాధితులను ఆదుకోవాలని కోరారు. నాయకులు సిద్దేశ్వర్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫొటో, వీడియోగ్రాఫర్ల క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఫొటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో డీజే జట్టుపై ఏఎన్ఆర్ జట్టు విజయం సాధించింది. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా విజేత జట్టు కు బహుమతులు ప్రదానం చే శారు. కార్యక్రమంలో ఫొటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో ప్రత్యేకత చాటాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్


విభాగాధిపతులతో మాట్లాడుతున్న డాక్టర్ ఆత్మారామ్

అనంతపురం వైద్యం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో ప్రత్యేక కోర్సులను అభ్యసించిన స్పెషలిస్ట్ డాక్టర్లుగా వైద్యసేవల్లో ప్రత్యేకతను చాటాలని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విభాగాధిపతులను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ కోరారు. ఆస్పత్రిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విభాగాధిపతుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జనరల్ ఆస్పత్రిలో దశాబ్దం క్రితం వరకు ఓపీ రిజిస్ట్రేషన్ వేయి వరకు మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం మూడు వేలకు చేరుకుందని తెలిపారు. సిబ్బంది కొరత ఉన్నాకూడా.. అత్యాధునిక పద్ధతుల్లో వైద్యసేవలు అందించడంతో ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోనూ సరిపడా మౌలిక సదుపాయాలను, పారామెడికల్, నర్సింగ్ స్టాఫ్‌ను సమకూర్చుతామన్నారు. ఓపీ, ఐపీ సంఖ్యను పెంచి నాణ్యమైన వైద్యసేవలందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ పీఆర్వోలు డాక్టర్ శివకుమార్, డాక్టర్ సౌజన్య, న్యూరో సర్జరీ విభాగం జీ.భాస్కర్, జీఎన్ భాస్కర్ బాబు, రవితేజ, యూరాలజీ విభాగం రంగస్వామి, రాజశేఖర్, న్యూరోబ్రెయిన్ రవిప్రకాష్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ప్రణీత్‌రెడ్డి, కార్డియాలజీ సుభాష్‌చంద్రబోస్, ఎండోక్రైనాలజీ డాక్టర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

● ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శుక్రవారం వారు కార్మికులతో కలిసి స్థానిక రామ్‌నగర్‌లోని మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఈ మేరకు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, నాయకులు నారాయణస్వామి, నూర్ బాషా, పుల్లయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అలాగే రాష్ట్రంలోని 13వేల మంది మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తూ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకట నారాయణ, గౌరవాధ్యక్షుడు గోపాల్, సీఐటీయూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళీ, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.3.03 కోట్ల సెల్‌ఫోన్ల రికవరీ

● బాధితులకు 1,216 అందజేత



పోలీసులు రికవరీ చేసిన సెల్‌ఫోన్లు

అనంతపురం క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో చోరీ అయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందజేసినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. వీటి విలువ రూ.3.03 కోట్లు ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో బాధితులకు సెల్‌ఫోన్లు అందజేఏ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై బాధితులకు ఫోన్లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో చోరీ అయిన 1216 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. వీటిలో రూ.499 సెల్‌ఫోన్ల నుంచి రూ.1.41లక్షల ఫోన్లు కూడా ఉన్నాయన్నారు. మూడేళ్ల కిందటి నుంచి జిల్లా పోలీస్‌శాఖలో చాట్‌బాట్ సేవలు ప్రారంభించి, ఇప్పటి వరకు 12,594 సెల్‌ఫోన్లు రికవరీ చేసి ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని బాధితులకు సైతం 1,179 ఫోన్లు అందించామని, అనంతపురం జిల్లానే కాకుండా ఇతర 18 జిల్లాల్లోకి వారికీ 2,795 సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందించినట్లు పేర్కొన్నారు. ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన సైబర్ విభాగం సీఐ జాకీర్, ఇతర సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

న్యూస్ బాక్స్

రేపు లక్ష్మన్న స్థూపం ఆవిష్కరణ



మాట్లాడుతున్న సీపీఐ తాలూకా కార్యదర్శి గోపాల్

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ జిల్లా మాజీ నాయకుడు లక్ష్మన్న ప్రథమ వర్థంతి సందర్భంగా కుందుర్పిలో ఆదివారం స్థూపాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ తాలూకా కార్యదర్శి గోపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నరసింహులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంత రాయుడు, సీపీఐ నాయకులు నాగరాజు నాయక్, బుడేన్‌సాబ్, రామ దాసు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా మహేశ్వర్‌రెడ్డి



పుట్లూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా జంగంరెడ్డిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచు మహేశ్వర్ రెడ్డిని శుక్రవారం నియమించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, తన ఎంపికకు సహకరించిన పార్టీ అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

బంకించంద్ర చటర్జీకి నివాళి

గుత్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీత రచయిత బంకిం చంద్రచటర్జీ 187వ జయంతిని స్థానిక ప్రభుత్వ పెన్షనర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు స్వర్ణాంభ, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, సభ్యులు షెక్షావలి, నారాయణ రెడ్డి, వెంకటేష్, గోవిందప్ప, దేవదాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణం పై ఫిర్యాదు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం వెళ్లే జాతీయ రహదారి పక్కన అనుమతులు లేకుండా ఓ మతానికి సంబంధించిన మందిరాన్ని నిర్మిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ భాస్కర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిర్మాణ దారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ రమణ, జిల్లా ఇన్‌ఛార్జ్ లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బంగారు మల్లారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

పామిడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక చైతన్య కాలనీలో నివాసముంటున్న టీడీపీ సీనియర్ కార్యకర్త మల్లికార్జున శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ , తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లబోతుల శ్రీనివాసులు, నాయకులు నివాళులర్పించారు.

ఎక్సైజ్ చెక్‌పోస్టుల తనిఖీ

విడపనకల్లు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు, డొనేకల్లు రాష్ట్ర సరిహద్దుల్లోని ఎక్సైజ్ చెక్‌పోస్టులను అనంతపురం ఎక్సైజ్ అధికారి రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తనిఖీలు చేశారు. అక్రమ మద్యాన్ని అరికట్టాలని అన్నారు. ఆయన వెంట డీటీఎఫ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ఉరవకొండ ఎక్సైజ్ సీఐ రవిచంద్ర, ఎస్‌ఐలు శ్రీరాములు, వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు మార్చండి

గుంతకల్లుటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఐటీయూ కాలనీలోని విద్యుత్ వైర్లు పాతవి కావడంతో అవి తెగిపడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీ కమిటీ సభ్యులు వాపోయారు. ఆ విద్యుత్ వైర్లను మార్చాలని విద్యుత్ శాఖ ఏడీఈ నాగేంద్రకు శుక్రవారం వారు వినతి పత్రం అందజేశారు. ఇందులో నాయకులు చంద్రశేఖర్, రామయ్య, రవి, షబ్బీర్, నాగరాజు, సమీర్, సాయి పాల్గొన్నారు.

రేపు సీపీఐ మండల మహాసభ

యాడికి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల మహాసభను ఆదివారం యాడికిలో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ తెలిపారు. శుక్రవారం అందుకు సంబంధించిన కర పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఇందులో నాయకులు వీకే ప్రదీప్‌రెడ్డి, బండారు రాఘవ, ఓబులరెడ్డి, గరిడి శివన్న, కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు.

పురాతన విగ్రహాలు లభ్యం

కుందుర్పి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌరమ్మ దేవాలయం చుట్టూ గ్రామస్థులు ఎక్స్‌కవేటర్‌తో శుక్రవారం శుభ్రం చేస్తుండగా పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. దీంతో గ్రామస్థులు వాటిని శుభ్రం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బయటపడిన పురాతన విగ్రహాలు

మునగ పెంపకంపై అవగాహన

రాయదుర్గంరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రైతులకు మునగ పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక దుర్గాదేవి సమైఖ్య మండలి కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సర్ఫ్ డైరెక్టర్ ఉన్నతి పద్మావతి శుక్రవారం నిర్వహించారు. మునగసాగు చేసే రైతులకు మార్కెటింగ్ యూనిట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. డీపీఎం గంగాధర్ మాట్లాడుతూ.. తక్కువ ధరకే ఈ రైతులకు టార్పలిన్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ శివారులోని ఎస్ఎఫ్‌సీ బిల్డింగులను పరిశీలించారు. రూ.కోట్ల విలువచేసే మిషన్లు బిల్డింగ్‌లో నిరుపయోగంగా ఉన్నాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వారి వెంట జీవనోపాధుల డైరెక్టర్ శ్రీనివాసులు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బీ గంగాధర్, సత్యసాయి జిల్లా జీవనోపాధుల ప్రాజెక్ట్ మేనేజర్ రామ్మోహన్, ఎంపీడీఓ కొండన్న, ఏసీ గోవిందప్ప, ఉత్పాదకత సంఘం డైరెక్టర్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నతి పద్మావతి



మార్కెట్‌లో కూరగాయల దుకాణాల ముందు ప్రవహిస్తున్న మురుగు నీరు

కూరగాయల మార్కెట్‌లోకి మురుగు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

గుంతకల్లు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కూరగాయాల మార్కెట్‌లో కొన్ని రోజులుగా డ్రైనేజీ నీరు ప్రవహిస్తుండటంతో పూర్తి అపరిశుభ్రంగా మారింది. దుర్వాసన భరించలేక ప్రజలు, వ్యాపారాలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా.. ఆ సమస్యను పరిష్కరించడం లేదు. దీంతో దుర్వాసన.. అపరిశుభ్రతలోనే ప్రజలు కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొంటున్నారు. గుత్తి రోడ్డులోని గోవిందు టీస్టాల్ వద్ద నుంచి కసాపురం రోడ్డు వాల్మీకి విగ్రహం వరకు మురుగు కాలువలు పూడిపోయాయి. దీంతో టీ స్టాల్ ఎదురుగా మెయిన్ రోడ్డులో కల్వర్టు కింద నీరు పోయే సౌకర్యం లేకపోవడంతో ఆ మురికి నీరంతా ప్రధాన రహదారిపై పారుతూ .. కూరగాయాల మా ర్కెట్‌లోకి వెళ్తుంది. కూరగాయలు, పూలు, పండ్లు, కిరాణా షాపులకు ప్రజలు ఆ మురికి నీటిలోనే వెళ్లి.. కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కాలువలు నిర్మిస్తాం

డ్రైనేజీ నీరు ప్రవహించకుండా శాశ్వత పరిష్కరం కోసం నూతన కాలువలు నిర్మించడానికి ఎస్టిమేషన్ వేశాం. త్వరలోనే కాలువ నిర్మాణ పనులు చేపడతాము.

- మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్



పామిడి, యాడికి, ఉరవకొండలో అమ్మవార్ల అలంకరణ

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పామిడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం తొలి శుక్రవారాన్ని పురష్కరించుకొని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకంబరీగా అలంకరించి.. పూజలు నిర్వహించారు.

● యాడికి : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం లో అమ్మవారిని గోరింటాకుతో ప్రత్యేకంగా అలంకరించారు.

● ఉరవకొండ: స్థానిక దుర్గాభవాని దేవాలయంలో అమ్మవారిని వారాహి దేవిగా అలంకరించారు.

సబ్సిడీ దాణా మంజూరు

బెళుగుప్ప, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలానికి 25 టన్నుల సబ్సిడీ పశువుల దాణా మంజూరైనట్లు పశువైద్యాధికారి మంజునాథ్ శుక్రవారం తెలిపారు. 50 శాతం సబ్సిడీతో పాడిరైతులకు దీన్ని అందజేస్తామని, 50 కిలోల బ్యాగ్ రూ. 1100 ఉండగా రైతు రూ. 550 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కసాపురం ఆలయంలో అభిషేకం

గుంతకల్లుటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర, ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో సీతారామచంద్ర, సహిత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి.. అభిషేకాలు చేసి.. తిరుమంజ స్నపనం నిర్వహించారు. ఇందులో ఆలయ ఈఓ కే వాణి, ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



అలంకరణలో ఉత్సవమూర్తులు



ట్యాబ్‌లు అందజేస్తున్న విప్ కాలవ

మహిళా సంఘాలకు ట్యాబ్‌లు

రాయదుర్గం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోమ్‌లో పట్టణ మహిళా స్వయంశక్తి సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శ్రమ్‌పోర్టర్ ద్వారా కార్మికుల వివరాలు పొందుపర్చే గురుతర బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సంఘాల సభ్యులకు అప్పగించారని, ఈ ట్యాబ్ ద్వారా ఆ కార్మికుల వివరాలు నమోదు చేయాలని సూచించారు.ఒక్కో కార్మికుడి వివరాలు ట్యాబ్ ద్వారా నమోదు చేసినందుకు రూ. 19 చెల్లిస్తుందన్నారు. ఆ వివరాల ఆధారంగానే కార్మికులకు ప్రభుత్వం పలు ప్రయోజనాలను కల్పిస్తుందన్నారు.

రేషన్ బదులుగా నగదు పంపిణీ వద్దు

రాయదుర్గంరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులుగా నగదు పంపిణీ చేయాలనే నినాదాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లప్ప, సీపీఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవనంలో రాయదుర్గం, కణేకల్లు, డీ.హీరేహాళ్ మండలాల నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రేషన్‌షాపుల్లో రేషన్ బదులు నగదు ఇవ్వాలని రేషన్‌కార్డుదారులకు లెక్కలను సర్వే మొదలు పెట్టబోతున్నారని, దీన్ని అందరూ బహిష్కరించాలని చేయాలని కోరారు. ఈ విధానం అమలులోకి వస్తే రేషన్ కార్డుదారులతో పాటు పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులూ ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎన్ నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటుపై రైతులతో సమావేశం

యల్లనూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామ సమీపంలో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై శుక్రవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. 400మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్ట్ ఏర్పాటుచేయడానికి అవకాశం ఉందని, ఇందుకోసం రైతుల నుంచి రెండు వేల ఎకరాల దాకా అవసరం ఉందని రీసైయిల్ కంపెనీ ప్రతినిధి హరీష్‌రెడ్డి తెలిపారు. 30 సంవత్సరాల లీజు ఉంటుందని, రెండు సంవత్సరాలకు ఒకసారి లీజు మొత్తం పెరుగుతుందని తెలిపారు.

5న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి

గుత్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను వచ్చే నెల ఐదో తేదీన నిర్వహిస్తున్నామని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి కోరారు. పోలీసులు, న్యాయవాదులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో ఈ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీతో పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పీడీ రత్నం, ఏజీపీ ఫక్రుబాషా, సీనియన్ న్యాయవాదులు జడ్ సతీష్, రామ్మోహన్‌రెడ్డి, గుత్తి,పామిడి, పెద్దవడుగూరు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రమించిన కార్యకర్తలకే పదవులు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పరిశీలకులు

గుంతకల్లు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యున్నతికి శ్రమించిన కార్యకర్తలకే పదవులను కేటాయించినట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్టీలో అసమ్మతికి తావు లేకుండా ఏకగ్రీవంగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. నూతన కమిటీలు రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షుడిగా బీ గుణశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఫజులుర్ రహిమాన్, గుంతకల్లు మండల కమిటీ అధ్యక్షుడిగా బండారు రామన్న చౌదరి, ప్రధాన కార్యదర్శిగా ఎన్ శోభన్‌బాబు, గుత్తి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంకే చౌదరి, ప్రసాద్, గుత్తి మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ బద్రివలి, పల్లా సాంబశివయ్య, పామిడి పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మ మోహన్ కృష్ణ, రాము, పామిడి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేశ్‌రెడ్డి, రామాంజినాయక్ పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో పరిశీలకులు తిమ్మయ్య చౌదరి, పర్వీన్ బాను, శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని మించిన మోదీ పాలన

గుంతకల్లు టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ పాలన.. కాంగ్రెస్ ఎమర్జెన్సీ పాలనను మించిందని, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, పౌరహక్కులను కాలరాస్తున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ విమర్శించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మోదీ ఫాసిస్ట్ నియంత్రత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొన్నాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజినేయులు, రామ్‌దాస్, గోపి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వాహనం బోల్తా

13 మందికి గాయాలు



బోల్తాపడిన వాహనం, గాయపడిన ఉపాధ్యాయులు

ఉరవకొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న తుపాన్ వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. అనంతపురానికి చెందిన ఉపాధ్యాయులంతా ఓ వాహనాన్ని అద్దెకు మాట్లాడుకుని, రోజు విడపనకల్లు మండలం పాల్తూరులోని పాఠశాలకు విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అనంతపురం నుంచి పాఠశాల విధులకు బయల్దేరారు. కోనాపురం వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ వాహనాన్ని తప్పించే క్రమంలో తుపాన్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన 12 మందికి స్వల్పగాయాలు కావడంతో.. వారు వేరే వాహనంలో విధులకు వెళ్లారు.

నేడు కార్యదర్శుల సామూహిక సెలవు

యాడికి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తమపై పని ఒత్తిడి తగ్గించాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి తాము శనివారం సామూహిక సెలవు పెట్టి .. అనంతపురం వెళ్తున్నట్లు మండలంలోని సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు వారు ఎంపీడీఓ వీరరాజుకు వినతిపత్రం అందజేశారు. పని ఒత్తిడితో చాలామంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శులు సతీష్, రమేష్‌రెడ్డి, హాజీవలి, శోభా ఉన్నారు.

● పుట్లూరు: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అలివేలమ్మకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు శివకేశవరెడ్డి, వెంకటనాయుడు, ఓబులేసు, సంధ్య, పెద్దన్న ఉన్నారు.

● రాయదుర్గంరూరల్: తమపై పనిభారం తగ్గించాలని సచివాలయ పంచాయతీ కార్యదర్శులు వెంకట్రాముడు, భీమేష్, శ్రీదేవి ఎంపీడీఓ కొండన్నకు వినతి పత్రం అందించారు. ఈ మేరకు శనివారం సామూహికంగా విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



యాడికిలో ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

క్రైం న్యూస్..

అట్రాసిటీ కేసు నమోదు

బెళుగుప్ప, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తనను రెండు రోజుల కులం పేరుతో దూషించాడని మండలంలోని యలగలవంకకు చెందిన హనుమన్నపై అదే గ్రామానికి చెందిన దళిత తిమ్మన్న గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో హనుమన్నపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు.

మహిళా మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో ముగ్గురు మహిళా మట్కాబీటర్లను శుక్రవారం అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి రూ.1.30 లక్షల నగదు, ఏడు మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఎస్ఐ గౌస్‌బాషాతో కలిసి ఈ దాడులు నిర్వహించామని, నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

జూదరుల అరెస్టు

బెళుగుప్ప, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణేపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామదాసు శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.4,450 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

సమాఖ్య కార్యాలయంలో చోరీ

రాయదుర్గం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాదేవి మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలు పగలగొట్టి అందులోని రూ. 2050 దోచుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఏసీ గోవిందప్ప తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దపప్పూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శింగనగుట్టపల్లి గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

ఈ స్టాంప్‌లో వైసీపీ తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది దేవేంద్రప్ప

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గంలో ఈ స్టాంప్ కుంభకోణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాత్ర ఉందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీనియర్ న్యాయవాది దేవేంద్రప్ప మండిపడ్డారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ స్టాంప్ కుంభకోణానికి పాల్పడిన బోయ యర్రప్ప అలియాస్ మీసేవా బాబు వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల అండతోనే ఈ అవినీతికి శ్రీకారం చుట్టారన్నారు. అవినీతికి ఆమడదూరంలో ఉండే ఎమ్మెల్యే అమిలినేనిపై ఇలా బురదజల్లడం తగదన్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఓనర్ల సమస్యలు పరిష్కరించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న ఆయిల్ ట్యాంకర్ల యజమానులు

గుంతకల్లు/టౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని అనంతపురంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్స్ కాంట్రాక్టర్స్ ఆయిల్ ట్యాంకర్ల ఓనర్లు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. కడప హెచ్‌పీసీ డిపోలో కొత్తగా ట్రాన్స్‌పోర్ట్‌కు టెండర్లు పిలిచారని, తమిళనాడు ట్యాంకర్స్ ఓనర్లు కూడా టెండర్ వేశారని, ఇందులో స్థానికులకే ప్రాధాన్యం ఇచ్చేలా హెచ్‌పీపీ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో హెచ్‌పీసీఎల్ ట్రాన్స్ పోర్టర్స్ కాంట్రాక్టర్స్ ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్లు ఎస్ రామాంజినేయులు, లారీ రమేష్, శివ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో బీసీ వెల్ఫర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి గ్రామ సచివాలయంలో దీన్ని ప్రారంభించారు.

సీఎస్‌డీటీగా శాంత



కూడేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కూడేరు మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారుగా శాంత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలోని డిపో డీలర్లు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు.

వ్యవసాయ సహాయ సంచాలకుడిగా రవి

తాడిపత్రి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా రవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న చెంగళరాయుడు కర్నూలు జిల్లా ఆలూరుకు బదిలీ కాగా, అనంతపురం నుంచి రవి ఇక్కడకి బదిలీ అయ్యారు.

సబ్ మార్కెట్ యార్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం



సబ్ మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న చైర్మన్

కణేకల్లు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అసంపూర్తిగా ఆగిపోయిన సబ్‌మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, డైరెక్టర్ చాంద్‌బాషా తెలిపారు. స్థానిక చంద్రబాబునాయుడుకాలనీ వద్ద ఆ యార్డును పరిశీలించిన వారు మాట్లాడారు. 2015లో రూ. 60 లక్షలతో దీన్ని నిర్మాణాన్ని ప్రారంభించారని, రూ. 40 లక్షల వరకు పనులు పూర్తి అయ్యాయని, రూ. 20 లక్షలు విడుదల కాకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయన్నారు. అలాగే రహదారి సమస్య కూడా ఉందని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంతో చర్చించి నిర్మాణాలను పూర్తి చేసి.. అందుబాటులోకి తెస్తామన్నారు.